# సొంత కారు లేని సోనియా!

- ఇంటర్ ప్రశ్నపత్రంలో ముద్రణ
- ప్రభుత్వం మారినా తప్పులు తప్పడం లేదని విమర్శలు



3లో

RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు | జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | ఆదివారం | 18 -02 - 2024

సంపుటి: 1 | సంచిక : 273 | పేజీలు : 4 | వెల : 5/-

# కమలం కృష్ణార్పణం!

- నదీ జల వివాదంలో కనిపించని బీజేపీ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే మాటల యుద్ధం
- కేఆర్ఎంబీకి అప్పగింతలో అందరి చూపు కేంద్రంవైపే
- అసెంబ్లీలో తిప్పికొట్టలేక పోయిన కమలనాథులు
- అడకత్తెరలో పోకచెక్కలా బీజేపీ స్టేట్ నాయకత్వం
- పార్లమెంట్ ఎన్నికల ముంగిట పార్టీ ఎదురీత



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ మెల్లగా సైడ్ ట్రాక్ పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడటంతో బీఆర్ఎస్ రేసులోకి వచ్చేందుకు అన్ని అస్త్రాలను ప్రయోగిస్తోంది. ఆ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చేందుకు అధికార పార్టీ అదే దూకుడు ప్రయోగిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ వెనుకబడిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కృష్ణా ప్రాజెక్టులు, కాళేశ్వరం విషయంలో బీజేపీ తన వాదనను సమ–ర్థంగా వినిపించలేకపోయింది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే సమరం సాగుతోందన్న అభిప్రాయం వినిపించడం ప్రారంభమయింది. అసెంబ్లీలో కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై యుద్ధం జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ హోరాహోరీ తలపడ్డాయి. ఎవరి వాదన వారు వినిపించారు. ఇందులో రాజకీయం ఉందా.. రాష్ట్ర ప్రయోజనాలున్నాయా అన్న సంగతి తర్వాత కానీ.. అసలు విషయం రెండు పార్టీలు కలిసి బీజేపీ గురించి ప్రజలు ఆలోచించకుండా చేశాయి. కృష్ణా ప్రాజెక్టులు అప్పగించడం లేదా ఉంచుకోవడం రెండింటిలో దేన్నీ తమ విధానంగా చెప్పలేని పరిస్థితిలో బీజేపీ పడిపోయింది. ఈ వ్యవహారంలో బీజేపీ ఆటలో అరటిపండుగా మారింది. ఇది బీజేపీకి పార్లమెంట్ ఎన్నికలకు ముందు తీర్చలేని సమస్యే. ఆ పార్టీ తరపున అసెంబ్లీలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. కానీ ఏపీ నీళ్లు తీసుకెళ్తూంటే.. బీఆర్ఎస్ సైలెంట్ గా ఉందన్న పాత వాదనే వినిపించారు. కొత్త విషయం చెప్పలేదు. కృష్ణా ప్రాజెక్టుల అంశాన్ని గట్టిగా తమ పార్టీ తరపున సమర్థించుకోవడమో లేదా రెండు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నాయన్న సంగతిని కానీ గట్టిగా చెప్పలేకపోయారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు కు ప్రాజెక్టులను అప్పగించిన వ్యవహారంపై అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగింది. ఈ చర్చ సారాంశం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వమే ప్రాజెక్టులను బలవంతంగా తీసుకుంటూ తెలంగాణకు అన్యాయం చేస్తుందన్న సందేశం ఇవ్వడం. బీఆర్ఎస్ నేతలు అదే తరహా ప్రసంగాలు చేశారు. కాంగ్రెస్ నేతలూ అదే చెప్పారు. అయితే ఇక్కడ రాజకీయం ఏమిటంటే వీరి ప్రసంగాల్లో ఎక్కడా కేంద్రాన్ని తప్పు పట్టలేదు. కానీ.. అసలు విలన్ కేంద్రమేనన్న సంకేతాలను గట్టిగా పంపారు. కృష్ణా ప్రాజెక్టుల్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి

మిగతా 4వ పేజీలో...

# కాస్కో.. చూస్కో..






- ఎత్తులు... పై ఎత్తులు
- తెలంగాణ పార్టీల గేమ్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : పార్లమెంట్ ఎన్నికలకు ముందు తెలంగాణలో రాజకీయాలు వేగంగా మారిపోతున్నాయి. కెసిఆర్ వేస్తున్న ఎత్తులకు కాంగ్రెస్ పార్టీ దీటుగా సమాధానం చెబుతోంది. ఇటీవల కేసీఆర్ నల్లగొండ సభ నిర్వహిస్తే.. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మేడిగడ్డ యాత్ర నిర్వహించారు. కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం తీరును కేసీఆర్ ఎండగడితే.. మేడిగడ్డ ఫిల్లర్ల కుంగుబాటుపై రేవంత్ రెడ్డి కెసిఆర్ తీరును ప్రశ్నించారు. ఈ పరిణామాలు తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ఇమేజ్ కు తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తున్నాయనే వాదన వినిపిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీపై తొలి రోజు నుంచే భారత రాష్ట్ర సమితి ఎదురు దాడి మొదలు పెట్టింది. పక్కలో బల్లెం లాగా ప్రతి విషయంలోనూ ప్రశ్నిస్తోంది. దీనికి బీఆర్ఎస్ అనుబంధ సోషల్ మీడియా విభాగం తోడు కావడంతో కాంగ్రెస్ పార్టీకి గెలిచిన ఆనందం ఏమాత్రం ఉండటం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 64 ఎమ్మెల్యేల బలం మాత్రమే ఉంది. ఇందులో 10 మందిని తమ వైపు తిప్పేసుకుంటే.. రాజకీయం రసవత్తరంగా మారుతుందని భారత రాష్ట్ర సమితి అంచనా వేస్తోంది. అందువల్లే ఈ ప్రభుత్వం ఆరు నెలలకు మించి ఉండదని భారత రాష్ట్ర సమితి నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. పలుమార్లు కేసీఆర్ కూడా ఇదే విషయాన్ని వెల్లడిం చారు. కెసిఆర్ పార్టీ పరంగా

మిగతా 4వ పేజీలో...

## పెరుగుతున్న రేవంత్ గ్రాఫ్

పదేళ్లు రాష్ట్రానికి నేనే సీఎంగా ఉంటా.. తర్వాత మరో పదేళ్లు తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యమే కొనసాగుతుంది. కేసీఆర్ ఇప్పుడే కూలుస్త అంటున్నడు.. రా.. చూసుకుందాం' అని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా సవాల్ విసిరారు. ఇప్పుడు ఈ విషయం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటు కాంగ్రెస్ పార్టీలోనూ చర్చ జరుగుతోంది. ఏధైర్యంతో ఈ మాట అని ఉంటారని కొందరు విశ్లేషిస్తుండగా, ఇలా చెప్పడం ద్వారా ప్రతిపక్షానికి ఎంత స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారన్న చర్చ కూడా జరుగుతోంది. వాస్తవానికి టీపీసీసీ అధ్యక్షుడు అయిన నాటి నుంచి తెలంగాణలో రేవంత్ గ్రాఫ్ పెరుగుతోంది. పీసీసీ పగ్గాలు చేపట్టిన



మిగతా 4వ పేజీలో...



## 3డీఎస్ సక్సెస్

- 'జీఎస్ఎల్‌వీ- ఎఫ్14' ప్రయోగం విజయవంతం
- ఇస్రో చరిత్రలో మరో మైలురాయి

2లో



# వందేళ్ల ప్రాజెక్టు.. మూడేళ్లకేనా?

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సభలో ఇరిగేషన్‌పై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసింది. నీటి ప్రాజెక్టులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సభలో వైట్‌పేపర్ రిలీజ్ చేసి మాట్లాడారు. ఇది స్వతంత్ర్య భారత దేశంలోనే అతి పెద్ద కుంభ కోణం అని ఆరోపించారు. కీలకమైన బ్యారేజ్ ఇలా నాణ్యత లోపంతో కుంగిపోవడం చాలా దురదృష్టకరమని కామెంట్ చేశారు. వందేళ్లు భద్రంగా ఉండాల్సిన కట్టడం మూడేళ్లకే కుప్పకూలిందన్నారు. గత ప్రభుత్వ అవినీతి వల్ల ప్రాజెక్టు

మిగతా 3వ పేజీలో...

### హరీష్ గోబెల్స్ ప్రచారం..

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



### తప్పు ఒప్పుకోండి..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



### తప్పుల తడక

శ్వేతపత్రంపై హరీశ్‌రావు విమర్శ



3లో



## మల్కాజిగిరికి మస్త్ పోటీ!

3లో

- బీజేపీలో పెరిగిన ఆశావహులు
- అభ్యర్థి ఎంపికలో చేతులెత్తేసిన రాష్ట్ర నాయకత్వం

# తలాతోక లేని కులగణన తీర్మానం

- కేవలం కంటితుడుపు చర్య
- తీవ్రంగా నిరసిస్తున్నాం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీలో చేసిన కులగణన తీర్మానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. కులగణన తీర్మానం కేవలం కంటితుడుపు చర్య అని ఆమె కొట్టిపారేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కులగణనకు చట్టబద్ధత కల్పించాలని, తక్షణమే ఆ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్‌కు కూడా చట్టబద్ధత కల్పించాలన్నారు.



3లో




## యూత్ కాంగ్రెస్‌లో ఫుల్‌జోష్

4లో

## ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్

ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా




3లో

# గొర్లలోనూ గోల్‌మాలే..!

- గొర్రెల పంపిణీలో తప్పులెతికిన కాగ్
- జీవాల తరలింపులో మాయాజాలం
- అంబులెన్స్‌లో రవాణా చేసినట్లు రికార్డులు
- ట్యాగింగ్‌లోనూ మోసాలు గుర్తించిన కాగ్



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అవకతవకల సిత్రాలు అన్నీఇన్నీ కావు. గొర్రెల పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలపై కాగ్ విస్తుపోయే నిజాలను బయటపెట్టింది. బైక్, కారు, బస్సు, అంబులెన్స్‌లో గొర్రెల రవాణా చేయడంతోపాటు గొర్రెలను కొనకుండానే కొన్నట్లు అధికారులు చూపించినట్లు తేల్చింది. దీనికి తోడు చనిపోయిన వారికీ గొర్రెలను పంపిణీ చేసినట్లు నమోదు చేయడంతో పాటు.. నకిలీ రవాణా ఇన్వాయిస్‌లతో 68 కోట్లు స్వాహా చేశారని కాగ్ నివేదిక తేల్చింది. గొర్రెలకు నకిలీ

మిగతా 4వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు శుభాకాంక్షలు



## బీఆర్ఎస్ నాయకుడు కానుగుల మహేష్

**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన బి.సునీతను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా ఎమ్మార్వో సునీత మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానుగుల మహేష్, నేనావత్ జలంధర్, ముమ్మిడి అజయ్ కుమార్, కండె వంశీ, వరుణ్, ప్రదీప్, శివ, తదితరులు పాల్గొన్నారు.




# కాలుష్యరహిత స్టీల్ పరిశ్రమ విస్తరణ

## జాయింట్ కలెక్టర్ రమేష్

**చిన్నశంకరంపేట్- ప్రభాత సూర్యుడు :** పరిశ్రమల ఏర్పాటు వల్ల యువతకు ఉపాధితో పాటు గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతాయని చిన్న శంకరంపేట రాధా స్మెల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం ఏర్పాటుచేసిన పర్యావరణ ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ రమేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు కార్మిక చట్టాలకు అనుకూలంగా లోబడే పరిశ్రమను విస్తరించాలని ఆయన కోరారు. జాయింట్ కలెక్టర్ పరిశ్రమ చైర్మన్ సునీల్ ను వివరణ కోరగా శంకరంపేట మండల ప్రజల కొరకు వైకుంఠ రథం తో పాటు ఫ్రీజర్ మరియు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సైకిళ్లను , స్థానికంగా ఉన్న ఆలయాలకు పరిశ్రమ తరపున నిధులు కేటాయిస్తానని, స్థానిక యువతకు నాలుగు వందల మందికి ఉపాధి కల్పిస్తానని సునీల్ తెలిపారు . కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ సర్పంచులు శ్రీమాన్ రెడ్డి, రాజిరెడ్డి, నాయకులు పోగుల రాజు, మేడి గణేష్, ఎర్రి కుమార్ లు మాట్లాడుతూ రాధా స్మెల్టర్స్ పరిశ్రమ వారు స్థాపించిన నాటి కాలం నుంచి కాలుష్యం నివారించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఎన్నో వేల చెట్లు పరిసర ప్రాంతంలో నాటించడం జరిగిందని వారు అన్నారు. పరిశ్రమలో యాభై శాతం స్థానిక పట్టణ వాసులకి ఉపాధి కల్పించాలని మరియు మిగతా యాభై శాతం మండల%శీ%లోని యువతకు కేటాయించాలని వారు అన్నారు. చిన్న శంకరంపేట నుండి మిర్జాపల్లికి వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం అయిందని గత మూడేళ్ల కాలం నుండి అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని కావున పరిశ్రమల యాజమాన్యం పట్టించుకోని ముందుకు వచ్చి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని ఈ రహదారి పరిసర ప్రాంత పరిశ్రమల వాహనాలు కు ఉపయోగపడుతుందని మండల బిజెపి అధ్యక్షులు పోగుల రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహసిల్దార్ , రామాయంపేట సిఐ వెంకటేశం , స్థానిక ఎస్సై నారాయణ , తెలంగాణలోని పలు జిల్లాల నుండి పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టుకు సంబంధించిన ఎన్ జి ఓ కార్యకర్తలు మండల స్థానిక నాయకులు కొలుకూరి లక్ష్మారెడ్డి ,బి రాధాకిషన్ , ఎర్రి బాబు, మాజీ ఉపసర్పంచ్ జీవన్, ఎడ్ల కిష్టయ్య, ఎల్లబోయిన బాబు,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



**ఇబ్రహీం పట్నం - ప్రభాతసూర్యుడు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పార్టీ అధ్యక్షులు చిలకల బుగ్గ రాములు , ప్రధాన కార్యదర్శి గోగి రెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షులు నిట్టి జగదీశ్వర్, మండల్ పార్టీ ఉపాధ్యక్షులు కాలే గణేష్, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌ఆరోగ్యంగా ఉండాలని,ప్రజల ఆకాంక్ష మేరకు మరొకసారి సీఎం కావాలని తెలంగాణ ప్రజలందరూ కోరుకుంటున్నారన తెలిపారు. కార్యక్రమంలో మండల్ నాయకులు పండాల దేవేందర్ గౌడ్,బీసీ సెల్ మండల్ నాయకులు మాజీ సర్పంచ్ కొంగర బీరప్ప, ఎస్సీ సెల్ మండల్ అధ్యక్షులు పంది మైసయ్య, ఎంపలా రవీందర్ రెడ్డి,ఉద్యమ నాయకులు గొరిగే శేఖర్ గౌడ్, నిట్టు శ్రీశైలం,చెరువు ఎంక దేవదాసు, జంగిలి ప్రభాకర్, నిట్టు అంజయ్య, పార్టీ యువజన నాయకులు కొత్త దేవేందర్ గౌడ్,బిఆర్ఎస్వి నియోజకవర్గం కోశాధికారి కొత్తపలి సాయి గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కెసిఆర్ పుట్టినరోజున పండ్లు పంపిణీ

**యాచారం - ప్రభాత సూర్యుడు :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,జన హృదయనేత, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా వినోబా నగర్ ఆందుల ఆశ్రమం స్ఫూర్తి జ్యోతి పౌండేషన్ లో బిఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజ్ కుమార్ అధ్వర్యంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి లో పాలు, పండ్లు, బ్రెడ్, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు జేర్కోనీ రాజు, యువజన విభాగం మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల వినోద్,పార్టీ సీనియర్ నాయకులు కల్లూరి శివ, నియోజక ప్రచార కార్యదర్శి చింతకింది విరేష ముదిరాజ్, నియోజక వర్గ ఉపాధ్యక్షుడు ఖాజు మహ్మద్, బిఆర్ఎస్ పార్టీ 6వార్డు అధ్యక్షుడు సొప్పరి కరుణాకర్, జెలందర్, దయచారి ,మాచర్ల గిరి,సంపత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేత

## తహసీల్దార్ రవీంద్ర దత్తు

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని పలు గ్రామాలలో గతంలో చేసిన లేఔట్లకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లు చేయబడవని, ధరణి రికార్డుల పేరుతో ఎవరైనా పట్టాదారులు పాసు పుస్తకాలను రిజిస్ట్రేషన్ కోసం వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్ మెట్ మండల తహసిల్దార్ రవీంద్ర దత్తు హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.



# ఆరోగ్యానికి దేహధారుఢ్యానికి క్రీడలు అవసరం

## నల్లవెల్లి మాజీ సర్పంచ్ దేరంగుల రాజు

**యాచారం -ప్రభాత సూర్యుడు :** యాచారం మండలం మాల్,తమ్మలోనిగూడెం గ్రామ పంచాయితీ పరిధి లోని సెయింట్ స్టీఫెన్స్ హైస్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో శనివారం మాల్ ప్రీమి యర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నల్లవెల్లి మాజి సర్పంచ్ దేరంగుల రాజు ముఖ్య అతి థిగా పాల్గోని బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ దేరంగుల రాజు మాట్లా డుతూ ఆరోగ్యానికి,దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని చెప్పారు. యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత రాణించాలి అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు తీయాలని,భవిష్యత్తులో ఇలా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి ఇక్కడి ప్రాంతానికి కూడా మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదు,గెలిచాము అని గర్వపడవద్దు, స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలి,ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రాపోతు యాదగిరి, గడ్డం శ్రీధర్ రెడ్డి,సిరమోని శేఖర్, మారగోని శేఖర్,గెనమోని పెద్దులు టోర్నమెంట్ నిర్వాహకులు ముద్దం శ్రీధర్,చిన్నోల చిన్న,శ్రీను క్రీడాకారులు తధితరులు పాల్గొన్నారు.






# 3డీఎస్ సక్సెస్

## 'జీఎస్ఎల్‌వీ-ఎఫ్14' ప్రయోగం విజయవంతం

**స్టేట్‌బ్యూరో - ప్రభాతసూర్యుడు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్(శ్రీహరికోట) నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 వాహక నౌక ఇన్సాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని నింగిలోకి మోసుకెళ్లింది. 18.46 నిమిషాల అనంతరం 2,275 కిలోల బరువు ఈ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇన్సాట్-3 డీఎస్‌ను వాతావరణ పరిశీలనలను మెరుగుపరచడానికి, భూమి, సముద్ర ఉపరితలాలను పర్యవేక్షించడానికి రూపొందించారు. తద్వారా వాతావరణ అంచనా, విపత్తు హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరుస్తుంది. ప్రస్తుతం కక్ష్యలోని ఇన్సాట్-3డీ, ఇన్సాట్-3డీఆర్ ఉపగ్రహాలతో కలిసి ఇది పనిచేస్తుంది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బందికి ఛైర్మన్ సోమనాథ్ అభినందనలు తెలిపారు. ఇన్సాట్-3డీఎస్‌తో భూ, సముద్ర వాతావరణంపై కచ్చితమైన సమాచారం అందుతుందన్నారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ వాహకనౌక 2,275 కిలోల బరువు గల వాతావరణ ఉపగ్రహం ఇన్‌శాట్-3డీఎస్‌ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టింది. తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఇవాళ సాయంత్రం 5.35 గంటలకు దీనిని ప్రయోగించారు. పదేళ్ల పాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది. గతంలో ప్రయోగించిన ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాలకు కొనసాగింపుగానే ఇన్‌శాట్-3డీఎస్‌ని పంపించారు. సుమారు 2,275 కిలోల బరువైన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పేలోడ్లున్నాయి. ఈ పేలోడ్లు వాతావరణ అంచనా, విపత్తు హెచ్చరికల కోసం మెరుగైన వాతావరణ పరిశీలన, భూమి, సముద్ర ఉపరితలాల పర్యవేక్షణ విధులను చేపడతాయి.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# సొంత కారు లేని సోనియా

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిచారు. రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎన్నికలకు ఇటీవల నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర నేతలతో కలిసి జైపూర్ వెళ్లి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి నామినేషన్ పత్రాలతో పాటు తన ఆస్తులు, కేసులకు సంబంధించిన వివరాలతో అఫిడవిట్ సమర్పించారు. ఈ అఫిడవిట్‌లో సోనియా ఆస్తులకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విదేశాల్లోని ఆమె ఆస్తుల వివరాలు బయటకొచ్చాయి. సోనియా ఆస్తుల విలువ మొత్తం రూ. 12 కోట్లుగా ఉన్నట్లు అఫిడవిట్‌లో ఉంది. అలాగే ఇటలీలో తనకు ఉన్న ఇంటి వివరాలను సోనియా ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపర్చారు. తనకు వారసత్వంగా ఇల్లు వచ్చిందని, ఈ ఇంటి విలువ ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం రూ.27 లక్షలుగా ఉందని తెలిపారు. 2014లో ఇంటి విలువ రూ.19.9 లక్షలుగా ఉందని అఫిడవిట్‌లో పేర్కొనగా.. ఇప్పుడు మరింత పెరిగింది. అలాగే అఫిడవిట్‌లోని వివరాల ప్రకారం.. సోనియా గాంధీ వద్ద రూ.కోటి విలువైన ఆభరణాలు ఉండగా.. బ్యాంకు డిపాజిట్లు, బాండ్లు, పెట్టుబడులు, రాయల్టీ ద్వారా వచ్చే ఆస్తుల విలువ రూ.6.38 కోట్లుగా ఉన్నట్లు స్పష్టం చేశారు. వీటి ద్వారా వచ్చే వడ్డీ, ఎంపీగా వచ్చే జీతమే తన ఆదాయ వనరని అఫిడవిట్‌లో సోనియా పేర్కొన్నారు. 2014 అఫిడవిట్ ప్రకారం సోనియా సంపద మొత్తం రూ.9.28 కోట్లుగా ఉండగా.. 2019లో రూ.11.82 కోట్లకు పెరిగింది. ఇప్పుడు 12 కోట్ల 53 లక్షల 76 వేల 822 రూపాయలుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక తనకు సొంత కారు లేదని తెలిపారు. ఢిల్లీలోని డేరా మండి గ్రామంలో వ్యవసాయం భూమి ఉందని, ప్రస్తుతం తన వద్ద రూ.90 వేల నగదు ఉన్నట్లు పొందుపర్చారు.

# ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్

**ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణమైనా రావొచ్చని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధి కారి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఆయన రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని అన్ని జిల్లాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధి కారులు, సిబ్బందికి ఎన్నికలలో పనిచేసే శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్లకు ముకేష్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు.




# మల్కాజిగిరికి మస్త్ పోటీ!

- బీజేపీలో పెరిగిన ఆశావహులు
- అభ్యర్థి ఎంపికలో చేతులెత్తేసిన రాష్ట్ర నాయకత్వం
- అగ్ర నాయకత్వానికే బాధ్యతలు అప్పగింత
- పేరు ఖరారు చేయడంలో అధిష్టానం మల్లగుల్లాలు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** మల్కాజ్ గిరి ఎంపీ సీటు కోసం బీజేపీలోని కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎలాగైనా ఈసారి ఇక్కడ్నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఫలితంగా వచ్చే ఎన్నికల్లో ఈ సీటు ఎవరికి దక్కబోతుందనేది ఆసక్తికరంగా మారింది. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్ గిరిలో భారతీయ జనతా పార్టీ నుంచి ఆశావాహులు తాకిడి అధికంగా ఉంది. పార్టీ అధిష్టానం అభ్యర్థుల జాబితా తయారీలో తలమునకలై గెలుపు గుర్రాల ఎంపికపై కసరత్తు చేస్తున్న నేపథ్యంలోనే ఈ స్థానం పై కన్నేసిన కొందరు ఆశావహులు తమకే టికెట్ ఖరారు అయినట్లుగా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార ఆర్భటంలో భాగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేపడుతున్నారు. మరికొందరైతే మరో అడుగు ముందుకేసి వాల్ పోస్టర్లు అతికించడంతో పాటు ఎన్నికల ప్రచార రథాలను పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో తిప్పుతున్నారు. పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేయకముందే పలువురు నేతలు ఎన్నికల ప్రచారాన్ని మురిపించేలా కార్యక్రమాలను చేపట్టడంపై ద్వితీయ శ్రేణి నాయకులు,కేడర్ ను అయోమయంలో ముంచేస్తుంది.ఇటీవల ఢిల్లీలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసంలో లోక్ సభ అభ్యర్థుల విషయం పై రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు డీకే అరుణ, మురళీధర్ రావు ,బండి సంజయ్, ఈటల రాజేందర్ , గరికపాటి మోహన్‌రావు, జితేందర్ రెడ్డి సంస్థ గత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర రావు సమావేశం అయ్యారు. ఇందులో రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల కోసం దరఖాస్తులను పరిశీలించగా ఇందులో మల్కాజిగిరి స్థానానికి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు నేతలు గ్రహించారు. ఈ సీటు కోసం మాజీ మంత్రి ఈటల రాజేందర్ గట్టిగా పోటీ పడుతున్నారు. తనకున్న రాజకీయ అనుభవం, ప్రజాదరణ దృష్టిలో పెట్టుకొని మల్కాజిగిరి టికెట్ తనకే ఇవ్వాలని అగ్రనేతలను కోరుతున్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు ఇదే సీటును బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్ రావు ఆశిస్తున్నారు. దశాబ్దాలుగా తనకున్న జాతీయస్థాయి అనుభవం, పార్టీతో తనకున్న అంకితభావం వంటి అంశాలు పరిగణలోకి తీసుకొని పోటీకి అవకాశం ఇవ్వాలని ఆయన అడుగుతున్నట్లు తెలుస్తుంది. వీరే కాకుండా మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ,బిజెపి రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, కొంపల్లి మోహన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమరయ్య,బీజేపీ అధికార ప్రతినిధి తుళ్ళ వీరేంద్ర గౌడ్ కూడా ఈ సీటును ఆశిస్తున్నారు.దీంతో ఈ స్థానం లో ఎవరిని బరిలోకి దింపాలనేది బీజేపీ అధిష్టానానికి అప్పగించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది.మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మేడ్చల్, మల్కాజ్గిరి, కూకట్పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్ ,కంటోన్మెంట్ ఉండగా ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో అంతటా బిఆర్ఎస్ విజయం సాధించగా, బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. గ్రేటర్ లో బీజేపీ పార్టీకి గతంలో పోల్చితే ఓటు శాతం పెరగడంతో తప్పకుండా మల్కాజిగిరి స్థానం కాషాయమయం అవుతుందనే నమ్మకం నేతల్లో బలంగా ఉంది.అందుకే ఈ సీటు పై ఆశావ హుల సంఖ్య అధికంగా ఉంది.ఈ నేపథ్యం లోనే ఆశావహులు పార్టీ అధిష్టానంతో పాటు ప్రజల అభిమానాన్ని చూరగొనేందుకు నేతలు ప్రచార ప్రయత్నాలు మొదలు పెట్టారు.పార్టీ జాతీయ నాయకుడు మురళి మురళీధర్ రావు అయితే ఏకంగా ఎన్నికల ప్రచార రథాన్ని మల్కాజిగిరి పరిధిలో దింపుతున్నారు. పార్టీ అధిష్టానం ఇంకా అభ్యర్థుల జాబితాను ప్రక టించినప్పటికీ ఆశావహులు మాత్రం ఎవరికీ వారే టికెట్ తమకే నని ధీమా వ్యక్తం చేస్తు న్నారు. ఇదిలా ఉంటే మల్కాజ్గిరి పార్లమెంట్ సీట్ పై స్థానిక పార్టీ నాయకులు మాత్రం లోకల్ నినాదాన్ని ముందుకు తీసుకొస్తున్నారు. మల్కాజిగిరి లోక్సభ స్థానంపై కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్, మధ్యప్రదేశ్ పార్టీ ఇంచార్జ్ మురళీధర్ రావు, మాజీ ఎంపీ సురేష్ రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమర య్యలు ప్రచారాలు నిర్వహిస్తుండడంతో స్థానిక నేతలు, కేడర్ అయోమయానికి గురవుతున్నారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు కొన్నాళ్లుగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తూ, కార్యకర్త లతో సమావేశం నిర్వహించడం, మరికొందరు ఫ్లెక్సీ, వాల్ రైటింగ్ వంటి కార్య క్రమాలు చేపట్టడం స్థానిక నేతలను ఆందోళ నకు గురి చేస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఈ కీలక పార్లమెంట్ స్థానంలో ఇంత మంది ఆశా వహులలో టికెట్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.



# తలాతోక లేని కులగణన తీర్మానం

- కేవలం కంటితుడుపు చర్య
- తీవ్రంగా నిరసిస్తున్నాం: కవిత

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** తెలంగాణ అసెంబ్లీలో చేసిన కులగణన తీర్మానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. కులగణన తీర్మానం కేవలం కంటితుడుపు చర్య అని ఆమె కొట్టిపారేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కులగణనకు చట్టబద్ధత కల్పించాలని, తక్షణమే ఆ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్‌కు కూడా చట్టబద్ధత కల్పించాలన్నారు. శనివా రం ఉదయం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కవిత మాట్లాడారు. కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో, ఎలా చేస్తారో ప్రభుత్వం చెప్పలేదని అన్నారు. స్పష్టత లేని కులగణన తీర్మానం బీసీలను మభ్యపెట్టే చర్య అని విమర్శించారు. తలాతోక లేని తీర్మానాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని చెప్పారు. బీసీలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో కులగణన చేపట్టే ముందు చట్టం చేశారని చెప్పారు.కాంగ్రెస్ పార్టీది బీసీ వ్యతిరేక చరిత్ర అని ఆరోపించారు. మండల్ కమిషన్ సమయంలో పార్లమెంటులో రాజీవ్ గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని గుర్తుచేశారు. 2011లో యూపీఏ హయాంలో చేసిన కులగణన నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు బీసీలు ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చారో రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ బాధ్యతలేని మాటలు మానుకోవాలని హితవుపలికారు.

# తప్పుల తడక

**మాజీ మంత్రి హరీష్‌రావు.**



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శ్వేత పత్రం అధికార, ప్రతిపక్షాల మధ్య సవాళ్లకు దారి తీసింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రవేశ పెట్టిన శ్వేత పత్రం తప్పుల తడకగా ఉందన్నారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు. గత ప్రభుత్వంపై బురద జల్లేందుకే దీన్ని సభలోకి తీసుకొచ్చారని ఆరోపించారు. అన్నింటినీ రుజువు చేసేందుకు తమకు సమయం కావాలని స్పీకర్‌కు హరీష్ రిక్వస్ట్ పెట్టారు. దీనిపై మాట్లాడేందుకు మాత్రం హరీష్‌కు కేవలం 30 నిమిషాల సమయం మాత్రమే కేటాయించారు. అభూతకల్పనలతో బీఆర్ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేసేందుకే సత్యదూరమైన పత్రాన్ని సభలో ప్రవేశ పెట్టాలని విమర్శించారు హరీష్‌రావు. ఇది శ్వేత పత్రం కాదని.. అబద్ధపు పత్రమని కామెంట్ చేశారు. మిడ్‌మానేరు విషయంలో మంత్రి చెప్పిందంతా అబద్ధమని అన్నారు. 775 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మిడ్‌మానేరు, ఎల్లంపల్లి తమ హయాంలో పూర్తయిందన్నారు. ఈ ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో పూర్తి అయ్యాయని నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇకపై పోటీ చేసి సభలో అడుగు పెట్టబోనని సవాల్ చేశారు. హరీష్ రావు మాట్లాడుతున్నంత టైం అధికార పక్షం అడ్డుతగులుతూనే ఉంది. ఆయన చేసిన ప్రతి కామెంట్‌కు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో శ్వేత పత్రంపై వాడీవేడి చర్చ సాగింది. తప్పుడు లెక్కలతో గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు హరీష్‌రావు. కృష్ణా నదిపై ప్రాజెక్టులు అప్పగిస్తామన్న గెజిట్ తీసుకొస్తే ఖండించిన దిక్కులేదన్నారు. తాము వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని సిద్ధమైతే ప్రభుత్వం స్పందించందన్నారు. ఎన్నికల ప్రచారంలో గోబెల్స్‌ప్రచారం చేసినట్లే.. సభలోనూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# వందేళ్ల ప్రాజెక్టు.. మూడేళ్లకేనా?

**మొదటిపేజీ తరువాయి..**

కుప్పకూలిందన్నారు. నీటి ప్రాజెక్టులపై సభ్యులకు పూర్తి అవగాహన కల్పించేందుకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నామని మంత్రి ఉత్తమ్ వివరించారు. కాళ్వేశ్వరంలో మేడిగడ్డ కీలకమైన బ్యారేజు అని తెలిపారు. ఇది గుండెకాయలాంటిదన్నారు. అలాంటి బ్యారేజ్ నిర్మాణంలో లోపారు కారణంగా ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. అవగాహన లేకుండానే దీని నిర్మాణం చేపట్టారని విమర్సించారు. వందేళ్లు ఉండాల్సిన ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిపోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చున్నారు. ఈ బ్యారెజ్ నిర్మాణానకి ముందు 18 వందల కోట్లకు టెండర్ పిలిచారని... నిర్మాణానికి మాత్రం నాలుగు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాలని తెలిపారు ఉత్తమ్‌కుమార్ రెడ్డి. రానురాను ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచుకుంటూ వెళ్లారని విమర్శించారు. ఈ సందర్భంగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ



అథార్టీ ఇచ్చిన నివేదికను సభలో ఉంచారు. ఈ ప్రాజెక్టు పూర్తిగా నాసిరకంగా ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. లోపాభూయిష్టంగా ఉన్న మేడిగడ్డ ప్రాజెక్టు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ అక్టోబర్ నుంచి నేటి వరకు కేసీఆర్ స్పందించలేదని విమర్శించారు ఉత్తమ్. గత ప్రభుత్వ అవినీతి నిర్లక్ష్యం కారణంగా బ్యారేజ్ బాగా పాడైపోయిందన్నారు. గత పదేళ్లలో ఇరిగేషన్‌లో జరిగిన అవినీతి మరెక్కడా జరగలేదన్నారు. స్వతంత్ర్య భారత దేశంలో ఇప్పటి వరకు చూడలేదన్నారు. ఇలాంటి తప్పులు చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేసారు.

**నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథార్టీ ఏం చెప్పింది...**

- ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్, నిర్వహణ పూర్తిగా నాసిరకం
- క్వాలిటీ కంట్రోల్ లేకపోవడంతో నిర్మాణంలో తప్పులు
- ప్రీమాన్‌సూన్, పోస్ట్ మాన్‌సూన్ టైంలో తనిఖీలు చేయలేదు
- అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కూడా అదే తరహాలో నిర్మించారు. అందుకే ఆ ప్రాజెక్టుల్లో నీరు నింపొద్దు

ఒక్క మేడిగడ్డే కాదని అన్నారం బ్యారేజీ కూడా లోపాభూయిష్టంగా ఉందన్నారు ఉత్తమ్. అక్కడ కూడా లీకులు వస్తున్నాయని తెలిపారు. అందుకే ఆ బ్యారేజ్‌లో నీరు నింపొద్దని ఎన్‌డీఎస్‌ఏ సూచించినట్టు పేర్కొన్నవారు. ఉన్న నీటి కూడా తొలగించాలని హెచ్చరించినట్టు తెలిపారు.

# తప్పు ఒప్పుకోండి..

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శ్వేతపత్రం పై అసెంబ్లీలో వాడివేడి చర్చ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆర్థికమంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు.. కాళేశ్వరం నిట్ట నిలువునా చిలిపోయింది అని పేర్కొన్నారు. మేడిగడ్డ కాదు అన్నారం, సుందిళ్ళ ప్రాజెక్టులు కూడా పోతది అని ఔఆూం చెప్పింది అని తెలిపారు. జ్యోతిష్యం కాదు, నిపుణులు చెప్పిన మాట అని మల్లు భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు.ఇక, మొబైలైజేషన్ అడ్వాన్స్ తీసుకున్న కాంట్రాక్టర్లతో పని ఎందుకు చేయించలేదు అని డిప్యూటీ సీఎం విక్రమార్క అన్నారు. రాజీవ్ సాగర్, దేవాదుల, పూర్తి చేస్తే 32 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇచ్చేది వదిలేసి.. లక్ష 72 వేళా కోట్లకు పెంచి కాళేశ్వరం కట్టారు అని ఆయన పేర్కొన్నారు. ఆయకట్టు సున్నా.. కాళేశ్వరం నేనే కడతా అన్నాడు కేసీఆర్.. ఇల్లు కట్టుకుంటే ఇంజనీరింగ్ అధికారిని పెట్టుకుంటాం. కాళేశ్వరం ఏం చేశారు.. మీరేం చదివారు అని ప్రశ్నించారు. మీరు కట్టిన కాళేశ్వరం నిట్ట నిలువునా చీలింది.. గత గవర్నర్ కాళేశ్వర్ రావు అని నీకు పెరు పెట్టారు హరీశ్ రావు.. కూలిన దానికి తప్పు ఒప్పుకోండి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.మహారాష్ట్ర సీఎం లేఖ రాయడానికి మా ఆలోచన మీదనే కదా అని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. తుమ్మిడి హట్టి దగ్గర మేము ప్రాజెక్టు కట్టాలనుకున్నాం కాబట్టే.. మహారాష్ట్ర అభ్యంతరం చెప్పింది.. 152 మీటర్ల ఎత్తులో ఉన్న చోట కట్టడానికి ఒప్పుకున్నారు మహారాష్ట్ర అని సంబరాలు చేసుకున్నది మీరు కాదా అని ఆయన ప్రశ్నించారు. చివరికి 100 కిలోమీటర్ల కిందికి వచ్చి కాళేశ్వరం కట్టారు.. మీరు అనుమతుల తెచ్చారా.. పైపులు తేవచ్చు, మోటార్లు పెట్టొచ్చు అని మీ ఆశ.. రాష్ట్రాన్నీ అప్పుల పాలు చేసి.. ఇప్పుడు తగుదునమ్మ అని మాట్లాడుతున్నాడు హరీష్ రావు.. ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన విషయాలు నిజం అని ఒప్పుకోండి అని భట్టి వెల్లడించారు.



# హరీష్ గోబెల్స్ ప్రచారం...

**ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తూ శాసనసభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. దీనిపై దీర్ఘకాలిక చర్చలో భాగంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. మేము మాట్లాడుతుంటే ఇంకో సభ్యులకు అనుమతి ఇవ్వకండి.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సత్యదూరమైన విషయాలు బుక్ లో పొందుపరిచారు అని పేర్కొన్నారు. ఆయకట్టు రెండు చోట్ల రెండు రకాలగా చెప్పారు.. వాస్తవం మాత్రం ఇంకోలా ఉందన్నారు. ఇక, ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 2014కి ముందు అంటే నిజాంకి ముందు ఆ తర్వాత అని చెప్పుకొచ్చారు.ఇక, నిజాం అప్పటి నుంచి నిధులు ఖర్చు పెట్టారా?.. రాయలసీమ లిఫ్ట్ గురించి అబద్ధాలు రాశారు అంటూ హరీశ్ రావు అన్నారు.. దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇస్తూ.. హరీష్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారు అని పేర్కొన్నారు. కేసీఆర్, జగన్ అనేక సందర్భాల్లో నీటి వాటాపై చర్చ చేశారు.. కేంద్రం నుండి లేఖ వచ్చింది అపెక్స్ లో పాల్గొనండి అని అన్నారు. అప్పుడు అభ్యంతరం చెప్తే రాయలసీమ ప్రాజెక్టు ఆగేది.. మీటింగ్ కి పోకుండా టెండర్ అయిపోయే వరకూ చుశారు అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు రీకౌంటర్ ఇచ్చారు.. వైట్ పేపర్ కాదు ఫాల్స్ పేపర్ ఇది అంటూ విమర్శించారు. ఎన్నికల్లో గోబెల్స్ ప్రచారం చేశారు.. సభలో కూడా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు అని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టులు అప్పగిస్తామని మినిట్స్ మీటింగ్ లో ఉంది.. ఫిబ్రవరి 1వ తేదీ జరిగిన మీటింగ్ లో కూడా ఒప్పుకున్నారు.. ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి చెప్పారు అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు.హరీశ్ రావు వ్యాఖ్యలకు ఉత్తమ్ కుమార్ స్పందిస్తూ.. మేము ఆ మినిట్స్ మీటింగ్ కు మేము ఒప్పుకోలేదన్నారు. ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించము అని చెప్పినం అన్నారు. అంటే, 299 టీఎంసీలకే ఒప్పుకోండి అంటారా హరీశ్ రావు అని ఆయన ప్రశ్నించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రత్యేక రైళ్ళు

## కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : ;తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. జాతర సందర్భంగా ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ప్రత్యేక రైళ్లు భక్తుల సౌకర్యార్థం నడుస్తాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్-వరంగల్, నిజామాబాద్-వరంగల్, సిర్పూర్ కాగజ్‌నగర్-వరంగల్ మార్గంలో నడుస్తాయని తెలిపారు. బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, భువనగిరి, జనగాం, ఘన్‌పూర్, కామారెడ్డి, మనోహరాబాద్, మేడ్చల్, ఆలేరు ప్రాంతాలకు చెందిన వారికి ఉపయోగపడనున్నాయి.సిర్పూర్ కాగజ్‌నగర్-వరంగల్-సిర్పూర్ కాగజ్‌నగర్ (07017/07018), సికింద్రాబాద్-వరంగల్-సికింద్రాబాద్ మధ్య (07014/07015) నిజామాబాద్-వరంగల్-నిజామాబాద్ (7019/07020) రైళ్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రభుత్వం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన సంక్షేమం విషయంలో చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే జాతరకు ప్రత్యేక రైళ్లు వేయడంతోపాటుగా జాతర ఏర్పాట్ల కోసం రూ.3కోట్లను కేటాయించిందని వివరించారు.

# సంపాదకీయమ్..

## క్విడ్ ప్రోకోకు బాండ్స్ కు తేడా లేదా!

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని రద్దు చేసింది సుప్రీంకోర్టు. అసలు ఏంటీ ఎలక్టోరల్ బాండ్ల పథకం? ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ స్కీమ్ ఉద్దేశమేంటి? మోదీ సర్కారు దీన్ని ప్రవేశపెట్టడానికి కారణమేంటి? విపక్షాలు ఈ స్కీమ్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? దీని వల్ల లబ్ధి పొందుతున్నది ఎవరు? దేశ సర్వోన్నత న్యాయస్థానం ఎందుకీ విధానాన్ని తప్పుపట్టింది?సాధారణంగా రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు, కోటీశ్వరులు, అభిమానులు విరాళాలు అందజేస్తూ ఉంటారు. అయితే.. బ్లాక్ మనీని వైట్‌గా మార్చుకునేందుకు చాలా మంది విరాళాల రూపంలో పార్టీలకు అందజేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలకు విరాళాలు సమకూర్చేందుకు ఒక విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. 2017లో కేంద్ర బడ్జెట్‌లో ఎలక్టోరల్ బాండ్లు ప్రవేశపెట్టి.. దాని ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే విధానానికి శ్రీకారం చుట్టింది.ఆ తర్వాత 2018 జనవరి 2న ఎలక్టోరల్ బాండ్స్ విధానాన్ని నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం.. దాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. దీని ద్వారా ఎవరైనా సరే.. తమ పేరు బయటకు రాకుండా వివిధ రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో విరాళాలను అందించవచ్చు. రిజిస్టర్ అయి ఉండి.. అంతకుముందు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం ఒక శాతం ఓట్లు పొందిన పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల నుంచి నిధులు పొందేందుకు అర్హత ఉంటుంది.రాజకీయ పార్టీలకు సహకారం అందించేందుకు వ్యక్తులు, కంపెనీలకు పారదర్శకమైన విధానం అమల్లోకి తేవడమే ఈ పథకం ఉద్దేశమని అప్పుడు కేంద్రం ప్రకటించింది. మన దేశానికి చెందిన పౌరులు, సంస్థలు వడ్డీ లేకుండా బ్యాంకుల నుంచి ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసే అవకాశం కల్పించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ప్రత్యేక శాఖల్లో వెయ్యి రూపాయల నుంచి కోటి రూపాలయ విలువైన బాండ్లు అందుబాటులో ఉంచారు. 15 రోజుల కాలపరిమితి ఉండే బాండ్లను దాతల పేర్లు చెప్పాల్సిన అవసరం లేకుండా.. బ్యాంక్ అకౌంట్ నుంచి పేమెంట్ చేయడం ద్వారా కొనుగోలు చేయొచ్చు.అలా దాతలు అందజేసిన ఎలక్టోరల్ బాండ్లను.. రాజకీయ పార్టీలు తమ అధికార అకౌంట్ల ద్వారా మాత్రమే డబ్బు రూపంలోకి మార్చుకునే అవకాశం ఉంది. ప్రతి ఏడాది జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరులో కేవలం 10 రోజుల పాటు మాత్రమే ఈ ఎలక్టోరల్ బాండ్లు అందుబాటులో ఉంటాయి. అయితే.. ఎన్నికల ఏడాది మాత్రం మరో నెలరోజులపాటు ఎక్కువగా బాండ్లు అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేశారు.ఈ బాండ్ల ద్వారా 2018 మార్చి నుంచి 2023 జూలై మధ్య పలు రాజకీయ పార్టీలకు 13 వేల కోట్ల రూపాయల నిధులు అందాయి. 2018 ? 2022 మధ్యే 9 వేల 208 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాలు జరిగాయి. అయితే.. 2023 జనవరిలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన ఆదాయంలో 55 శాతానికి పైగా బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీలకు చేరాయి. అయితే.. ఇందులో సింహభాగం మాత్రం అధికార బీజేపీయే దక్కించుకుంది.2022-23 సంవత్సరంలో దేశంలోని కేవలం 10 కంపెనీలే ఎలక్టోరల్ బాండ్ల రూపంలో 332 కోట్ల రూపాయల నిధులు అందజేశాయి. ఇందులో 259 కోట్లు బీజేపీకే అందగా.. 5 ఐదు ఎలక్టోరల్ ట్రస్ట్‌ల ద్వారా బీఆర్ఎస్ 90 కోట్లతో నాలుగో స్థానంలో ఉంది. ఇక వైఎస్సార్ కాంగ్రెస్, ఆప్, కాంగ్రెస్ పార్టీలకు 17 కోట్లకు పైగా నిధులు సమకూరాయి.ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో సాగే బ్యాంకుల ద్వారా తీసుకునే డొనేషన్లు పారదర్శకతను పెంచుతాయని తొలి నుంచీ కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. కానీ.. తమకిష్టమైన పార్టీలకు నిధులు అందించడం ద్వారా పలు కంపెనీలు లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తామని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు.. ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

## పెరుగుతున్న రేవంత్ గ్రాఫ్

మొదటిపేజీ తరువాయి..

మొదట్లో అసలైన కాంగ్రెస్ వాదులం అంటూ కోమటిరెడ్డి బ్రదర్స్, హనుమంతరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లాంటి వాళ్లు విభేదించినా తర్వాత అధిష్టానం జోక్యంతో సర్దుకుపోయారు. దీంతో క్రమంగా రేవంత్ పార్టీపై పట్టు సాధించారు. తర్వాత సమష్టిగా ఎన్నికలకు వెళ్లి పార్టీని అధికారంలోకి తెచ్చారు. దీంతో రేవంత్ గ్రాఫ్ మరింత పెరిగింది.రేవంత్ సీఎం కావడానికి కూడా ఆయనకు పెరిగిన ఇమేజే కారణం. భట్టి విక్రమార్క పోటీ పడినా అధిష్టానం రేవంత్‌వైపే మొగ్గు చూపింది.

# యూత్ కాంగ్రెస్‌లో ఫుల్‌జోష్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఉన్న సంఖ్యా బలం ప్రకారం రెండు రాజ్యసభ స్థానాలు దక్కనున్నాయి. దీంతో గెలుపు ఖాయం అనుకున్న రాజ్యసభ టికెట్ కోసం పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలతో పాటు, ఏఐసీసీ నేతలు పోటీ పడ్డారు. సీనియర్ నేతలైన చిన్నారెడ్డి, వీ హనుమంతరావు పేర్లు రాజ్యసభ రేసులో ముందువరుసలో వినిపించాయి. వీరితో పాటు మరికొంత మంది నేతలు పార్టీ పెద్దలతో టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఏఐసీసీ నేతల్లో అజయ్ మాకెన్, సుప్రియ శ్రీనటే రాజ్యసభ టికెట్ ఆశించిన వారిలో ఉన్నారు.అయితే వీరిలో అజయ్ మాకెన్‌కు కర్ణాటక నుంచి రాజ్యసభ టికెట్ దక్కగా మిగతా వారికి నిరాశ మిగిలింది. పైగా తెలంగాణ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం ట్విస్ట్ ఇచ్చింది. యువనేతగా ఉన్న అనిల్ కుమార్ యాదవ్‌ను పెద్దల సభకు పంపి యువతకు కాంగ్రెస్ పెద్ద పీఠ వేస్తోందన్న సంకేతాలనిచ్చినట్లైంది. రేణుకా చౌదరికి రాజ్యసభ దక్కడంతో ఖమ్మం లోక్‌సభ బరిలో ఎవరు ఉంటారనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.ఖమ్మం లోక్ సభ స్థానంలో టికెట్ కోసం రేణుకా చౌదరి దరఖాస్తు చేసుకోలేనప్పటికీ ఈ స్థానం తనదే అని గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. అయితే సోనియా గాంధీ సైతం ఖమ్మం లోక్‌సభ బరిలో నిలుస్తారనే చర్చ తెరపైకి రావడంతో ఈ టికెట్‌పై పార్టీలో తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. రాజస్థాన్ నుంచి సోనియాగాంధీ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయగా, రేణుకా చౌదరి కూడా తెలంగాణ నుంచి పెద్దల సభకు నామినేట్ అయ్యారు. ఖమ్మం టికెట్ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్ రెడ్డి, సీనియర్ నేత వీ హనుమంతరావు, ప్రముఖ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్ర ప్రసాద్ సహా పలువురు ఖమ్మం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో టికెట్ వరించేదెవరికో అనేది టీ కాంగ్రెస్‌లో ఆసక్తిగా మారింది. ఇక కీలకమైన నామినేటెడ్ పదవులు ఎమ్మెల్సీలు, రాజ్యసభ స్థానాల




హడావిడి ముగియడంతో ఇక నేతల చూపు లోక్ సభ మీదకి మళ్లింది. ఎంపీ టికెట్ల కోసం ఇప్పటికే 300 పైగా అప్లయ్ చేసుకున్నారు. ఒకవైపు సునీల్ కనుగోలు టీం ఇప్పటికే గెలుపు గుర్రాల కోసం సర్వే చేస్తోంది. కీలకమైన ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలు యువకులకు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ యువ నేతల్లో జోష్ నిండింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, యువకుడు బల్మూర్ వెంకట్ ని ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన కొద్ది రోజులకే రాజ్యసభ స్థానాన్ని కూడా యువనేత, జాతీయ స్థాయిలో యూత్ కాంగ్రెస్ వింగ్ లో ఉన్న అనిల్ కుమార్ కి ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో యువకులకు ప్రాధాన్యత ఉంటుందన్న సంకేతాలు వెళ్లాయి. ఈ రెండు కీలక నిర్ణయాలు పార్టీలో పని చేస్తున్న విద్యార్థి విభాగం, యూత్ వింగ్ నాయకుల్లో ఉత్సాహం నింపింది. తాము కూడా కష్టపడి పార్టీ కోసం పనిచేస్తే పదవులు వస్తాయనే చర్చ ఆయా కమిటీల్లో మొదలైంది.మొత్తంగా సీనియర్లకు ఇచ్చే రాజ్యసభ సీటు కూడా యువ నేతలకు ఇవ్వడంతో చాలా మంది యువ నాయకుల్లో ఆశలు చిగురించాయి. వచ్చే లోక్ సభ ఎన్నికల కోసం చాలా మంది నేతలు ట్రై చేస్తున్నారట. చూడాలి మరీ ఇంకా అవకాశం దక్కే యువ నేతలెవరో..!



# గొర్లలోనూ గోల్‌మాలే..!

మొదటిపేజీ తరువాయి..

ట్యాగ్‌లతో మరో 92 కోట్ల అవినీతి జరిగిందని, గొర్రెల పంపిణీలో 253.93 కోట్ల వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేసింది.తెలంగాణలో గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగించే కుటుంబాలకు స్థిరమైన జీవనాధారం కల్పించడం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పెంపకం అభివృద్ధి పథకాన్ని తీసుకువచ్చింది. 2017 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారునికి 20 గొర్రెలను, ఒక పొట్టేలను కలిపి ఒక యూనిట్‌గా అందజేశారు. ఒక యూనిట్ విలువ 1.25 లక్షల రూపాయలు కాగా అందులో 75 శాతం 93,750 రాయితీ ఇచ్చారు. 25 శాతం మేర 31250 లబ్ధిదారుడు చెల్లించాడు. ఈ పథకం కింద 2017-18, 2018-19 సంవత్సరాల్లో రెండేళ్ల వ్యవధిలో 5వేల కోట్ల వ్యయంతో 4 లక్షల గొర్రెల యూనిట్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2021 డిసెంబరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 3,385.32 కోట్ల రాయితీ వ్యయంతో 3.88 లక్షల మంది లబ్ధిదారులకు అంతే సంఖ్యలో గొర్రెల యూనిట్లను సరఫరా చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. గొర్రెల పంపిణి పథకంలో భారీగా అక్రమాలు జరిగాయని కాగ్ నివేదిక తేల్చింది. అసెంబ్లీలో గొర్రెల పంపిణీలోని అక్రమాలపై కాగ్ నివేదిక ప్రవేశపెట్టగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.గొర్రెలను సాధారణంగా ట్రాలీతో ఉన్న వాహనంలో తరలిస్తారు. కానీ, తెలంగాణలో మాత్రం గొర్రెలను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కారు, బస్సు, అంబులెన్స్‌లోనూ తీసుకురావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. తెలంగాణలోని ఏడు జిల్లాల్లో గొర్రెల పంపిణీపై విచారణ జరిపిన కాగ్ నమ్మలేని నిజాలను వెలికితీసింది. గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగాయని తేల్చింది. జీవాలను కొనకుండానే కొన్నట్లు చూపడంతో పాటు, చనిపోయిన వారికీ కూడా గొర్రెలను పంపిణీ చేసినట్లు కాగ్ గుర్తించింది. అందులో ప్రధానంగా నకిలీ రవాణా ఇన్వాయిస్‌లతో 68 కోట్లు స్వాహా చేసినట్లు కాగ్ తేల్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో ఒక బైకుపై ఒకేసారి ఏకంగా 126 గొర్రెలను తరలించినట్లు ఇన్వాయిస్ లను గుర్తించింది. బైకుపైనే కాదు.. కారులో, బస్సులో, చివరికి అంబులెన్స్‌లో కూడా గొర్రెలను తరలించినట్లు రికార్డుల్లో చూపడాన్ని బట్టి ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. గొర్రెలను కొనకుండానే కొన్నట్లు, తరలించకుండానే ఏదో ఒక వాహనం నెంబరు వేసి ఆ వాహనంలో తరలించినట్లు చూపించి వందల కోట్లు స్వాహా చేసినట్లు కాగ్ నివేధికలో పేర్కొంది.గొర్రెల గొనుగోలకు సంబంధించిన నకిలీ ఇన్వాయిస్ ల మీద చెల్లింపులు, కొన్న గొర్రెలనే మళ్లీ మళ్లీ కొనడం, అవే గొర్రెలకు నకిలీ ట్యాగులు ఇవ్వడం, క్షేత్ర స్థాయిలో అసలు గొర్రెలే కనిపించకపోవడంతో పాటు గొర్రెల రవాణాకు ఉపయోగించిన వాహనాలన్నీ నకిలీవేనని కాగ్ నివేధిక తేల్చింది. గొర్రెలకు నకిలీ ట్యాగ్‌లతో 92 కోట్లు స్వాహా చేసినట్లు కాగ్ పరిశీలనలో తేలింది.

# కమలం కృష్ణార్పణం!

మొదటిపేజీ తరువాయి..

అప్పగిస్తోందనేది బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణ. తాము అప్పగించే ప్రశ్నే లేదని.. గతంలోనే అప్పగిస్తూ సంతకాలు చేశారని కాంగ్రెస్ వాదిస్తోంది. దీనిపై అసెంబ్లీలో వాడివేడి చర్చ. ఇందులోనే తాము ప్రాజెక్టులు అప్పగించబోమని తీర్మానం చేసింది కాంగ్రెస్.. బీఆర్ఎస్ సమర్థించింది. మరి బీజేపీ ఎక్కడ ?. రెండు విధాలుగా ఇరుక్కుపోయింది బీజేపీ అందుకే సైలెంట్ అయిపోయింది. రెండు పార్టీలు కలిసి పరస్పర యుద్ధం చేసుకుంటున్నట్లుగా షో చేసి.. బీజేపీని విలన్ గా ప్రజల ముందు పెట్టాయన్న అనుమానాలు బీజేపీ నేతలు పెరుగుతున్నాయి. అసెంబ్లీ యుద్ధం చూస్తే తెలంగాణలో రాజకీయం అంతా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య జరుగుతోందని అనిపిస్తే అందులో తప్పేమీ లేదు. ఎందుకంటే ఈ విషయంలో బీజేపీ తన వాదన కూడా వినిపించడానికి ఆసక్తి చూపించలేకపోయింది. ఇద్దరూ నాటకాలు ఆడుతున్నారని అంటున్నా.. బీజేపీ గురించి పట్టించుకోకుండా గ్రౌండ్ లో ఉత్కంఠ భరిత యుద్ధం చేసేస్తున్నారు బీఆర్ఎస్, కాంగ్రెస్ కేసీఆర్ నల్లగొండలో సభ పెడితే.. కాంగ్రెస్ మేడిగడ్డ టూర్ ఏర్పాటు చేసింది. ప్లాన్డ్ గా ఎమ్మెల్యేలందర్నీ తీసుకెళ్తామని చెప్పింది. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్న పార్టీల్లో కాంగ్రెస్, సీపీఐ, మజ్లిస్ పార్టీలు మేడిగడ్డకు వెళ్లాయి. బీఆర్ఎస్, బీజేపీ మాత్రమే వెళ్లలేదు. దీంతో ఆ రెండు పార్టీల మధ్య బంధం ఉందని.. కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. దీన్నిగట్టిగా తిప్పికొట్టలేని పరిస్థితుల్లో బీజేపీ పడిపోయింది. గతంలోనూ ఇలాంటి ప్రచారమే జరిగింది. అది బీజేపీకి నష్టం చేసింది. తెలంగాణలో బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్యే ఏదో పోరాటం నడుస్తోందని.. రెండు పార్టీల మధ్యే యుద్ధం జరుగుతోందని అనిపించడానికి.. కృష్ణా ప్రాజెక్టులు, మేడిగడ్డతో పాటు ఇతర అంశాలతో రాజకీయం చేస్తున్నారని బీజేపీ అనుమానిస్తోంది. అసలు లేని వివాదాన్ని తెరపైకి తెచ్చి సభలు.. సమావేశాలు పెట్టుకుంటున్నారని.. ఇదంతా లోక్ సభ ఎన్నికల రాజకీయం అని గట్టిగా నమ్ముతోంది. కానీ.. కౌంటర్ ఇవ్వడానికి మాత్రం ఆ పార్టీకి సరైన అవకాశం .. వాయిస్ దొరకడం లేదు. కృష్ణా ప్రాజెక్టుల్ని తాము కాపాడుతున్నామంటే.. తాము కాపాడుతున్నామని బీఆర్ఎస్, కాంగ్రెస్ అసెంబ్లీ వేదికగా వాదించుకుంటున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజు సాగర్ డ్యాంపై ఏం జరిగిందో అందరూ చూశారు. ప్రాజెక్టును ఆక్రమించుకున్న ఏపీ పోలీసులు బలవంతంగా గేట్లు కూడా ఎత్తేసుకున్నారు. ఇదంతా రాజకీయ వ్యూహంలో భాగమన్న అనుమానాలు ఉన్నాయి. ఇది రెండు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడటానికి కారణం అయింది. మరోసారి అలా జరగకుండా కేంద్రం రక్షణ ఏర్పాటు చేసింది. లోక్ సభ ఎన్నికలపై బీజేపీ చాలా ఆశలు పెట్టుకుంది. మోదీ హవా, రామమందిరం ట్రాన్స్‌తో కనీసం పది సీట్లను గెల్చుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. కానీ రాజకీయ పరిస్థితులు మాత్రం.. రెండు పార్టీల మధ్య పోరాటంలా మారుతోంది. లోక్ సభ ఎన్నికలు కాబట్టి బీఆర్ఎస్‌కు అసలు చాన్స్ ఉండదని రెండు జాతీయ పార్టీల మధ్య పోరాటం జరుగుతుందని అనుకున్నారు.

# కానొక్క.. చూనొక్క...

మొదటిపేజీ తరువాయి..

ఓడిపోయినప్పటికీ.. ఆయన ఇమేజ్ తెలంగాణ రాష్ట్రంలో చెక్కుచెదరలేదు. అందువల్లే ఆయన ప్రతిసారీ "కాంగ్రెస్ పార్టీ ఎక్కువ రోజులు అధికారంలో ఉండదని" అంటున్నారు. ఈ ఇమేజ్ ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఏ క్షణమైనా.. ఎలాంటి ప్రతిబంధకాలు ఎదురైనా తట్టుకునే శక్తి కాంగ్రెస్ పార్టీకి అవసరం. అలాంటి శక్తి సంపాదించాలంటే.. ఐదేళ్లపాటు ప్రభుత్వం సాఫీగా నడవాలంటే కాంగ్రెస్ పార్టీ బలమైన పునాదులు ఏర్పాటు చేసుకోవాలి.

అన్నింటికీ మించి కారు పార్టీకి కర్త, కర్మ, క్రియ అయినట కెసిఆర్ ను బలహీనపరచాల్సి ఉంటుంది. అందువల్లే కాంగ్రెస్ పార్టీ వరుసగా గత ప్రభుత్వ తప్పిదాలను ఏ కరువు పెడుతోంది. వీటివల్ల కెసిఆర్ ఇమేజ్ ను ప్రజల్లో చులకన చేసస్తున్నది. కెసిఆర్ ఇమేజ్ పై ఆధారపడిన భారత రాష్ట్ర సమితి పరపతిని ప్రజల్లో తగ్గిస్తోంది. పార్లమెంటు ఎన్నికలకు ముందు దీనిని మరింత తగ్గిస్తే ప్రభుత్వానికి వచ్చిన డోకా ఏమీ ఉండదని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు..వివిధ నివేదికల ప్రకారం.. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ఉంటే కెసిఆర్ ప్రభుత్వం ఓడిపోయేది కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి కేసీఆర్ ను టార్గెట్ చేసే కంటే.. ఆయన పాలనలో తీసుకొన్న నిర్ణయాలు, చేపట్టిన పనులలో అసలు విషయాలను బయట పెడుతున్నారు. అవినీతి జరిగిందని, అక్రమాలకు పాల్పడ్డారని ప్రచారం చేస్తున్నారు.

ఇది గనుక విజయవంతం అయితే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు భారత రాష్ట్ర సమితి నుంచి పెద్దగా ఇబ్బంది ఉండదని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నుంచి పది పార్లమెంటు స్థానాలు గెలుచుకుంటామనే ధీమా కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో కనిపిస్తోంది. ఎలాగూ భారత రాష్ట్ర సమితిని సైడ్ తప్పిస్తే.. బిజెపితోనే కాంగ్రెస్ పార్టీ పోటీ పడాల్సి ఉంటుంది. అప్పుడు తెలంగాణలో సరికొత్త రాజకీయ సమీకరణ తెరపైకి వస్తుంది. బిజెపికి నాలుగు లేదా ఐదు స్థానాలు వస్తాయనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చూపించి.. అధిష్టానం ఎదుట మంచి మార్కులు కొట్టేయాలని భావిస్తోంది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215